సాక్షి ఒడిశా

గురువారం । 6 । మార్చి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,60,911

బంగారం : 12 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

వెండి : 29 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ప్రాజెక్ట్ పనుల పరిశీలన

జిల్లాలో తాగునీటి ప్రాజెక్ట్ పనులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, తాగునీటిశాఖ మంత్రి రవి నారాయణ్ నాయక్ పరిశీలించారు.

-11లో▸



బొత్ర సేవలు మరువలేనివి

సమాజ సేవకుడు, విద్యాదాత, కవి, రచయిత, పాత్రికేయుడు, స్వర్గీయ ప్రభుదాన్ బొత్ర సేవలు మరువలేనివి అని పలువురు వక్తలు కొనియాడారు.

-11లో▸

న్యూస్‌రీల్

డీసీపీగా జగ మోహన్ మీనా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జగ మోహన్ మీనా

భువనేశ్వర్: భువనేశ్వర్ కొత్త డీసీపీగా జగ మోహన్ మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2013 సంవత్సరపు ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఇప్పటివరకూ డీసీపీగా విధులు నిర్వహించిన పినాక్ మిశ్రా నుంచి జగమోహన్ మీనా బాధ్యతలు చేపట్టారు. కటక్ నగర డీసీపీగా కూడా ఈయన పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికలపై గట్టి నిఘా వేస్తామన్నారు. దీనికోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమాన్యులకు సైతం పోలీసు సేవలు అందిస్తామన్నారు. ఇందులో భాగంగా భువనేశ్వర్ ప్రజల కోసం 82803 38302 నంబర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎవరికైనా తమ సేవలు అవసరమైతే ఈ నంబర్‌ను సంప్రదించాలని, వాట్సాప్ ద్వారా కూడా సమస్యలను తెలియజేయవచ్చునన్నారు.

నాలుగు గంటలు జగన్నాథుని దర్శనం నిలిపివేత

భువనేశ్వర్: పూరీ జగన్నాథ మందిరంలో బుధవారం సాయంత్రం మూల విరాట్టు దర్శనాన్ని నాలుగు గంటలపాటు తాత్కాలికంగా నిలిపి వేశారు. రత్న వేదికపై కొలువు దీరిన బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, జగన్నాథుని మూల విరాట్టులకు శ్రీ ముఖ సింగారం సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు భక్తులకు స్వామి దర్శనాన్ని నిలిపి వేసినట్లు దేవస్థానం అధికార యంత్రాంగం తెలిపింది.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- రుణ మేళాలలో ఎమ్మెల్యే రూపు బొత్ర



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రూపు బొత్ర

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కార్యాలయ ప్రాంగణంలో మిషన్ శక్తి మేగా రుణ మేళా బుధవారం నిర్వహించారు. సమితి బీడీఓ సంధ్య సమరత్ పర్యవేక్షణలో జరిగిన మేళాకు కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు బొత్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందని వెల్లడించారు. సుభద్ర పథకంలో ప్రతి మహిళకు ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు వారి ఖాతాల్లో వేస్తుందన్నారు. మహిళలకు అందజేస్తున్న ఆర్థిక సహాయం, రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బొరిగుమ్మ సమితిలోని 110 మహిళా స్వయం సహాయక గ్రూపులకు రూ.4 కోట్ల 10 లక్షల 80 వేల చెక్‌ను అందజేశారు. నాలుగు స్వయం సహాయక గ్రూపులకు రూ.పది లక్షల చొప్పున రుణం అందజేశారు. సమితి కో ఆర్డినేటర్ దేవేంద్రకుమార్ పండా పర్యవేక్షించారు.

అడుగంటిన చెరువు!



ఎండిపోయిన పట్నాయక్ చెరువు

పర్లాకిమిడి: పట్టణంలో బలుంకేశ్వర ఆలయం వద్ద వున్న పుష్కరిణి కాలక్రమేణా ఏపుగా గడ్డి, పిచ్చి మొక్కలుపెరిగి ఎండిపోయింది. పట్నాయక్ చెరువుగా పిలువబడే ఈ పుష్కరిణిలో ఒకప్పుడు చాలామందికి వేసవిలో స్నానాలు ఆచరించడం, చేపల చెరువుగా పేరు గాంచింది. పచ్చకామర్లు వ్యాధిగ్రస్తులు ఈ పుష్కరిణిలో స్నానం చేస్తే అనారోగ్యం నుంచి విముక్తి అవుతారన్న నమ్మకం వుండేది. కాలక్రమేణ ఈ పుష్కరిణి ఆక్రమణలకు గురు కావడం, పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో కుసించుకుపోయింది. చెరువు పుణరుద్ధరణకు పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి స్థానికులతో చర్చించి తగు చర్యలు చేపడతామని అన్నారు.

జన హృదయ నేత బిజూ



శంఖ భవన్ సభలో ప్రసంగిస్తున్న విపక్ష నేత నవీన్ పట్నాయక్

- రాష్ట్ర చరిత్రకారున్ని అగౌరవపరచడం ప్రభుత్వానికి తగదు
- బిజూ పట్నాయక్ జయంతి సభలో మాజీ సీఎం నవీన్



ఫారెస్టు పార్కులో బిజూ పట్నాయక్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న విపక్ష నేత నవీన్ పట్నాయక్



రాయగడ: బిజూ విగ్రహం వద్ద బీజేడీ నాయకులు

భువనేశ్వర్: రాష్ట్ర చరిత్రకారునిగా పేరొందిన దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ పట్ల రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అగౌరవ భావం ప్రదర్శించిందని విపక్ష నేత నవీన్ పట్నాయక్ తీవ్ర మనస్తాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు రావొచ్చు, పోవచ్చు కానీ ఒడియా ప్రజల హృదయాల్లో బిజూ పట్నాయక్ చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. బిజూ పట్నాయక్ విలువని దిగజార్చే ప్రయత్నాలు జరగడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. బిజూ బాబు జాతీయ నాయకుడు కాదు, అంతర్జాతీయ నాయకుడని గుర్తు చేశారు. స్థానిక శంఖ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన బిజూ జయంతి సభలో పాల్గొని నవీన్ పట్నాయక్ ప్రసంగించారు. కాగా, ఏటా మార్చి 5వ తేదీన బిజూ జయంతి పురస్కరించుకుని నిర్వహించే పంచాయతీరాజ్ దివస్ వేడుకలను వేరే తేదీకి మార్చడంపై బిజూ అభిమానులు, అనుచరుల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. ప్రభుత్వాల మార్పు చేర్పులతో చరిత్రకారుల ఘనత నీరుగారిపోయే విచారకర పరిస్థితులు ఎన్నడు చూడనట్లు ఈ వర్గం వ్యాఖ్యానిస్తోంది.

బిజూ పట్నాయక్‌కు ఘన నివాళులు

రాయగడ: ఒడిశా వరపుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ బిజూ పట్నాయక్ 109వ జయంతిని బీజేడీ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కొత్త బస్టాండు వద్ద గల బీజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, సీనియర్ నాయకులు బ్రజసుందర్ నాయక్, సుజాత పాలో, అనసూయా మాఝి, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో...

పర్లాకిమిడి: బిజూ పట్నాయిక్ జయంతి సందర్భంగా పర్లాకిమిడి హైస్కూల్ జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీజేడీ నాయకులు, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పూలదండలు వేసి నివాళులర్పించారు. బిజూ పట్నాయక్ అమర్ రోహ అని నినదించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఎమ్మెల్యే రూపేష్ పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. హైటెక్ ప్లాజాలోని బీజేడీ పార్టీ కార్యాలయంలో బీజూ పట్నాయక్ జయంతి సందర్భంగా కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, బసంత్ దాస్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, పట్టణ బీజేడీ అధ్యక్షులు సితేంద్ర మహాపాత్రో, జెడ్పీటీసీ సభ్యుడు (గుసాని) యస్.బాలరాజు, గుసాని సమితి అధ్యక్షులు ఎన్.వీర్రాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ పాల్గొన్నారు.



పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: పర్లాకిమిడి హైస్కూల్ జంక్షన్ వద్ద బీజేడీ పార్టీ శ్రేణుల సందడి

ఫారెస్టు పార్కులో శ్రద్ధాంజలి..

స్థానిక ఫారెస్ట్ పార్క్‌లో జరిగిన బిజూ జయంతి వేడుకల్లో ప్రతిపక్ష నాయకుడు, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. బిజూ పట్నాయక్‌కు నివాళులు అర్పిస్తూ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గుర్తించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 1993 నుంచి చరిత్రాత్మకంగా జరుపుకునే ఒక రోజుకు గుర్తింపుని తొలగించడం విచారకరమన్నారు. క్రీడా అవార్డులు, విమానాశ్రయం వంటి ప్రముఖ సంస్థల పేర్లని రాష్ట్ర ప్రభుత్వం మార్చే ప్రయత్నాలపై నవీన్ ఘాటుగా స్పందించారు. బిజూ బాబు విగ్రహం విధ్వంసానికి పాల్పడిన వారి వ్యతిరేకంగా బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. దివంగత నేత బిజూ పట్నాయక్ ఆవిష్కరించిన పారాదీప్ పోర్టు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్), తాల్చేరు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ), రౌర్కెలా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వంటి ముఖ్యమైన పారిశ్రామిక మరియు విద్యా సంస్థలను మూసివేయగలరా? అని నవీన్ బీజేపీకి సవాల్ విసిరారు. ప్రస్తుత పరిపాలన సంకుచిత దృక్పథంతో కూడిన రాజకీయాలతో కొనసాగుతోందని విమర్శించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను స్థాపించడం నుంచి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే దిశలో బిజూ పట్నాయక్ కృషి చిరస్మరణీయమని గుర్తు చేశారు. ఒడిశా అభివృద్ధిలో బిజూ పట్నాయక్ పాత్రను, ఇండోనేషియా స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇవ్వడం, యునెస్కో కళింగ అవార్డు వంటి అంతర్జాతీయ సహకారాలను ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ గుర్తు చేశారు.

సాక్ష్యం చెబుతాడని ప్రాణం తీశారు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జితేంద్రకుమార్ పండా

- తిరిసింగి ముతామఝి హత్యకేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్టు

పర్లాకిమిడి: మాజీ వార్డు మెంబరు తిరిసింగి ముతామఝి హత్య కేసును అడవ పోలీసులు ఛేదించారు. ఇందులో ప్రమేయమున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా బుధవారం రాణిపేట డి.పి.ఓ.కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. మోహనా బ్లాక్ అడవ పి.ఎస్.పరిధి కటమా వాటర్ ట్యాంకు వద్ద ఈ నెల 3న ఉదయం పాణిగండ గ్రామం నుంచి వస్తున్న తిరిసింగి ముతామఝిని నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు పదునైన టంగియా, రాయితో కొట్టి చంపారు. మృతుడి భార్య చబితా ముతామఝి (తువ్వాబడి గ్రామం) అడవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. డీఎస్పీ అమితాబ్ పండా, అడవ ఐఐసీ, సుబ్రాంత్ పండా కేసు దర్యాప్తుచేశారు. ముతా మఝి, సురేష్ మఝి మధ్య పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగినట్టు గుర్తించారు. కేసుకు సంబంధించి సురేష్ మఝి (జడింగి), శ్యాంసన్ మల్లిక్ (కంధమాల్), మనోజ్ మఝి(పజిగుడి), బిశ్వరంజన్ ఉత్తాన సింగ్(తువ్వాబడి)లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు సురేష్ మఝి సోదరుడు, మాజీ మావోయిస్టు ఎ.కె.47తో ఒకర్ని కాల్చినపుడు మృతుడు ముతామఝి సాక్షిగా ఉన్నాడు. 2021లో జరిగిన ఈ కేసులో సురేష్ మఝి సోదరుడు అరెస్టయ్యాడు. ఇప్పుడు తుది విచారణలో ఉండగా ముతా మఝి కోర్టులో సాక్ష్యం ఇవ్వనున్నాడని తెలిసి నిందితులు ఈ హత్యకు పాల్పడ్డారు. నిందితుల వద్ద నుంచి బైక్, ఐదు సెల్‌ఫోన్లు, మూడు వేటకత్తులు (టంగియా) స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ పండా తెలిపారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ అమితాబ్ పండా, అడవ పోలీసులు పాల్గొన్నారు.

'సుభద్ర'తో మహిళాభ్యున్నతి



ర్యాలీలో పాల్గొన్న మేయర్ సులోచన దాస్, తదితరులు



ర్యాలీకి హాజరైన మహిళలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం సుభద్ర యోజన పట్ల అవగాహన పెంపొందించేందుకు నడుం బిగించింది. ఈ పథకంపై మహిళలకు విస్తృత అవగాహన కల్పించేందుకు బుధవారం రాజధాని నగరం భువనేశ్వర్ నుంచి ర్యాలీ ప్రారంభించింది. అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధిదారులుగా చేరాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. సుభద్ర యోజన శ్రేయస్సు ఫలాలు ప్రతి మహిళ అందుకోవాలనే సందేశంతో నగరం వ్యాప్తంగా బీదల ప్రభావిత ప్రాంతాల్లో సుభద్ర ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ఖండగిరి కూడలి నుంచి ప్రారంభమై జొగొమొరా వీధి వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఏకామ్ర నియోజకవర్గ ఎమ్మెల్యే బాబు సింగ్, నగర మేయర్ సులోచన దాస్, కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తింపజేస్తామని చెప్పారు. దరఖాస్తు గడువు ఈ నెలాఖరుతో ముగియనున్నందున అర్హులంతా చేరాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఇంటింటా సర్వే చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న 1.8 కోట్ల మంది మహిళల్లో 1.20 కోట్ల మంది మహిళలకు తొలి విడత కింద ఐదో దశ పంపిణీ గురువారం జరుగుతుందని తెలిపారు.

ఆశ్రమ పాఠశాల ఘటనపై విచారణ చేయాలి



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి దీసారీగూడ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని గర్భం దాల్చి.. గత నెల 24వ తేదీన బిడ్డకు జన్మనిచ్చిన ఘటనపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక డీసీసీ కార్యాలయంలో బుధవారం విచారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముదుంగా విద్యార్థిని చదివిన పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయుడుతో మాట్లాడారు. అలాగే వసతి గృహంలో బాలికల ఆరోగ్య సేవకురాలతో చర్చించారు. అనంతరం బాలిక స్వగ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించారు. ఆశ్రమ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని తల్లి అయిందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ కూడా కలిసి సంఘటనపై విచారణ వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ.. విచారణ చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విచారణ కమిటీలో చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, మాజీ మంత్రి నాగేంద్రప్రసాద్, గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగో, న్యాయ్యవాది మానస్ మల్లిక్, పాలిపిక మాఝి, నవరంగ్‌పూర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి భుజబల్ మాఝి, మల్కన్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గోవిందపాత్రో తదితరులున్నారు.

దోపిడీ దొంగల అరెస్టు



సునీల్ పొరజ



ప్రభీర్ హరిజన్

జయపురం: కత్తితో బెదిరించి డబ్బులు దోచుకున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఒడియామేదరి వీధికి చెందిన సునీల్ పొరజ అలియాస్ లాలు, సొరగుడ సమీపంలో ఉంటున్న ప్రభీర్ హరిజన్ ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 1న బొరిగుమ్మ సమితి సేమలగుడ పంచాయతీ నకులగుడ గ్రామానికి చెందిని జుధిష్ఠర్ మాలి స్నేహితుడు బైక్ సర్వీసింగ్ కోసం జయపురం వచ్చాడు. బైక్ సర్వీసింగ్ అనంతరం మధ్యాహ్నం భోజనం చేసి తమ గ్రామానికి బయలుదేరాడు.ఆ సమయంలో జయపురం గాంధీ చౌక్ సమీపంలో ముగ్గురు దుండగులు స్కూటీపై వచ్చారు. జుధిష్టర్‌ను ఫోన్ ఇచ్చేయాలని బెదిరించారు. అందుకు అంగీకరించకపోవడంతో అతడిని కొట్టి అతడి చేతులు వెనక్కి విరచి కత్తి చూపి ఏడు వేల రూపాయలు దోచుకుపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అక్కడి సీసీ టీవీలను పరిశీలించి దుండగులు వచ్చిన స్కూటీ నంబర్ ఆధారంగా యజమానిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా తెలిసిన వ్యక్తికి స్కూటీ ఇచ్చానని వెల్లడించాడు. తమదైన శైలిలో పోలీసులు ప్రశ్నించగా దోపిడీ సూత్రధారి సునీల్ పొరజ అని గుర్తించారు. బైక్‌లు తీసుకెళ్లి దొంగతనాలు చేయడం సునీల్‌కు అలవాటని, గతంలోనూ ఇలా దొంగతనాలు చేశాడని పోలీసు అధికారి వెల్లడించారు. అతడితో పాటు ప్రభీర్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసుని ఏఎస్‌ఐ రమేష్ చంద్ర మహాపాత్రో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ పనులు



పనులు ప్రారంభం కానున్న జగన్నాథ్‌సాగర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జయపురంలో చారిత్రిక జగన్నాథ్ సాగర్ పురుద్ధరణ, సౌందర్యీకరణ పనులు పది రోజుల్లో పునఃప్రారంభం కానున్నాయని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. బుధవారం జయపురంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పునరుద్ధరణ పనుల కోసం గత నెల 24వ తేదీన ప్రభుత్వం రూ. 9.25 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గతంలో సాగర్ పునరుద్ధరణ పనులను మహిళా స్వయం సహాయక గ్రూపువారు చేపట్టారని.. అయితే నిధుల కొరత కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు వివరించారు. ఆ పనులలో అవినీతి జరిందని కొంతమంది ఆరోపించారని అన్నారు. ఆరోపణలపై విచారణకు ప్రభుత్వం ఒక కమిటీని వేసిందన్నారు. ఆ కమిటీ తన రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించిందని.. సాగర్ పనులలో ఎటువంటి అవినీతి జరుగలేదని వెల్లడైందని ఎమ్మెల్యే వివరించారు. మూడు నెలల్లో పునరుద్ధరణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగర్ సౌందర్యీకరణ పనులు పూర్తయితే జగన్నాథ్ సాగర్‌ను ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా రూపొందించగలమన్నారు. జగన్నాథ్ సాగర్ నాలుగు వైపులా గతంలో ఆక్రమణలు జరిగాయని..అయితే అప్పట్లో నోరు విప్పనివారు నేడు విమర్శలు చేయడం తగదన్నారు. ఆనాడు తాను ఆక్రమణలను వ్యతిరేకించానని కాని ప్రభుత్వం మిన్నకుందని వెల్లడించారు. మత్స్య విభాగం ఆధీనంలోని 25 ఎకరాల సాగర్ స్థలం సాగర్‌లో మమేకం చేస్తామని వెల్లడించారు. జగన్నాథ్ సాగర్ సౌందర్యీకరణ, ఉన్నతే తన ధ్యేయమన్నారు. సమావేశంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నిహార్ బిశాయి పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



సంఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాయగడ: యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. జిల్లాలోని గుణుపూర్ పాతబస్టాండు సమీపంలో ఉన్న గొలావీధి వద్ద యువకుని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు గుణుపూర్‌కు చెందిన కరాల్ రాజు (38)గా గుర్తించారు. మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుని గొంతు వద్ద గాయాం ఉండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దర్యాప్తు చేపట్టిన పోలీసులు కుటుంబ కలహాల కారణంగా యువకుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే మృతికి కారణం తెలుస్తోందని పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

516 పెన్నులతో అలంకరణ



నరసన్నపేటలోని వెంకటేశ్వర ఆలయం సమీపంలో ఉన్న లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారికి బుధవారం 516 పెన్నులతో అర్చన చేశారు. అనంతరం వాటిని తోరణంగా అలంకరించారు. అర్చకులు భాస్కరబట్ల జగదీశ్వర శర్మ పూజా కార్యక్రమం పూర్తయ్యాక పదో తరగతి విద్యార్థులకు ఈ పెన్నులు పంపిణీ చేశారు. – నరసన్నపేట

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ ఫలితాలను బుధవారం ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎకనామిక్స్, ఇంగ్లిష్, రూరల్ డెవలప్‌మెంట్, తెలుగు, ఎంకాం, ఎంబీఏ, ఎంఈడీ, ఎంఎల్ఐఎస్సీ, జువాలజీ, ఎంజేఎంసీ, మైక్రోబయాలజీ కోర్సుల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. కంప్యూటర్ సైన్స్‌లో 22 మందికి 18 మంది, అప్లయిడ్ మ్యాథ్స్‌లో 8 మందికి ఏడుగురు, ఎనలాటికల్ కెమిస్ట్రీలో 41 మందికి 40 మంది, బయోటెక్నాలజీలో 25 మందికి 24 మంది, ఫిజిక్స్‌లో 12 మందికి 8 మంది, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 185 మందికి 118 మంది, గణితంలో 15 మందికి 14 మంది ఉత్తీర్ణత సాధించారు.

నేడు మద్యం షాపుల లాటరీ



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గీత, సొండి కులాలకు కేటాయించిన 18 మద్యం షాపులకు గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా గురువారం ఉదయం 10 గంటలకు డ్రా తీయనున్నారు. ఈ మేరకు శ్రీకాకులం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని అంబేడ్కర్ ఆడిటోరియానికి ఉదయం ఎనిమిది గంటలకల్లా దరఖాస్తుదారులు హాజరుకావాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.తిరుపతినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన మద్యం పాలసీ (2024–26)లో భాగంగా జిల్లాలో గీత, సొండి కులాల వారికి పదిశాతం మద్యం దుకాణాలు ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. జిల్లాలో 18 షాపులకు 203 దరఖాస్తులు అందాయి. మొదటగా ఫిబ్రవరి 10న డ్రా తీయాలని నిర్ణయించినా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

గార : మండల పరిధిలోని అంపోలు జంక్షన్ వద్ద విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో 54 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. బుధవారం సాయంత్రం సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా బియ్యం రవాణా చేస్తూ వాహనం పట్టుబడిందని విజిలెన్సు అధికారులు యు.వెంకటేష్, ఎస్సై రామారావు తెలిపారు. నడగాం గ్రామానికి చెందిన పొట్నూరు శ్రీరామమూర్తి స్థానికంగా బియ్యం సేకరించి నడగాం పరిసర ప్రాంతాల్లోని కోళ్ల ఫారాలకు రవాణా చేస్తున్నట్టు గుర్తించామని చెప్పారు. విజిలెన్సు ఎస్పీ బి.ప్రసాదరావు ఆదేశాల మేరకు పీడీఎస్ అక్రమ రవాణాదారులపై నిఘా ఉంచామని, పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇస్కాన్.. ప్రదర్శన అదిరెన్..



ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో శ్రీకాకుళం ఇస్కాన్, జగన్నాథ్ బలదేవ్ సుభద్ర మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న హరేకృష్ణ ఉత్సవ్‌లో భాగంగా బుధవారం విదేశీయులు ప్రదర్శించిన వామనావతార వైభవం అబ్బురపరిచింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు కళ్లకు కట్టినట్లు నాటకం ప్రదర్శించారు.

–శ్రీకాకుళం కల్చరల్

కళాప్రవీణ బండారు చిట్టిబాబు

కన్నుమూత

- 70 ఏళ్లుగా సంగీత సేవ
- నివాళులర్పించిన ప్రముఖులు



చిట్టిబాబు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖ గాయకులు బి.ఎ.నారాయణ, మండపాక శారద



శ్రీకాకుళం కల్చరల్: లలిత సంగీతానికి ఎనలేని సేవలు అందించిన ప్రముఖ సంగీత కళాకారుడు బండారు చిట్టిబాబు(89) బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. హార్మోనియం కళాకారుడిగా, ఆర్కెస్ట్రా నిర్వాహకుడిగా సుమారు ఏడు దశాబ్దాల పాటు కళామతల్లి సేవలో తరిస్తూ ఎంతో మంది గాయకులను తీర్చిదిద్దారు. 1936లో బండారు సత్యనారాయణ, వరాలమ్మ దంపతులకు 5వ సంతానంగా జన్మించిన చిట్టిబాబు సంగీతంలో అసమాన ప్రతిభతో రాణించారు. 400కుపైగా లలిత గీతాలకు స్వరకల్పన చేశారు. ప్రముఖ సినీ నటులు రావి కొండలరావు, తిమ్మరాజు శివరావుల సహకారంతో 1955లో సుకుమార్ ఆర్కెస్ట్రాను నెలకొల్పారు. సినీ రచయితలు దేవులపల్లి, ఆరుద్ర, సినారె, జొన్నవిత్తుల, దూసి ధర్మారావు తదితరులు రచించిన లలిత గీతాలకు స్వరకల్పన చేస్తూ హార్మోనియంపై వాయిద్య సహకారం అందించారు. 'అంటరాని వారు ఎవరంటే', 'ఏది హిందూ.. ఏది ముస్లిం' వంటి పాటలను జాతీయ భాషల్లో కూడా స్వరపరిచారు. ప్రముఖ సినీ గాయకులు జి.ఆనంద్, బి.ఎ.నారాయణలతో కలిసి రథసప్తమి సందర్భంగా ఏకాంత సేవ నిర్వహించారు. 1974లో రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం, 1983లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కళాప్రవీణ బిరుదులు అందుకున్నారు. 1984లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సభ్యునిగా ఎనలేని సేవలు అందించారు. ఈయన కుమారుడు బండారు రమణమూర్తి తబలా కళాకారుడిగా ఏ–గ్రేడ్ ఆర్టిస్టుగా పేరుగాంచారు.



ఘంటసాలతో బండారు చిట్టిబాబు(ఫైల్)

ప్రముఖుల సంతాపం..

చిట్టిబాబు మృతి సంగీతానికి తీరని లోటని గాయకులు నిక్కు అప్పన్న, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, తరుణి కృష్ణ సంస్థ ప్రతినిధులు మండా శ్రీనివాసరావు, ఎం.వి.కామేశ్వరరావు, ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, చిట్టి వేంకటరావు, రామచంద్రదేవ్, పన్నాల నరసింహమూర్తి, ప్రముఖ గాయకులు బి.ఎ. నారాయణ, మండపాక శారద, కె.ఎల్.ఎన్ మూర్తి, కళ్యాణం రామ్మోహన్‌రావు, తదితరులు సంతాపం తెలియజేశారు.

బిజూ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రోగులకు మిఠాయిలు పంచుతున్న బీజేడీ కార్యకర్తలు

జయపురం: మాజీ ముఖ్యమంత్రి బిజయానంద పట్నాయక్ ఉరఫ్ బిజూ పట్నాయక్ జయంతిని జయపురం బీజేడీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బుధవారం స్థానిక బిజూ రాజనగర్ కూడలి వద్ద బిజూ విగ్రహానికి బీజేడీ నేత, జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రథ్ (మున్న రథ్), తదితరులు నివాళులర్పించారు. జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు వెళ్లి రోగులకు పండ్లు, స్వీట్లు పంచారు. బిజూ పట్నాయక్ రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.



మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బిజూ విగ్రహం

ఆవిష్కరణకు నోచుకోని విగ్రహం

బిజూ విగ్రహాన్ని జయపురం మున్సిపాలిటీ అధికారులు రెండేళ్ల క్రితం తయారుచేయించారు. నేటికీ ఆవిష్కరణకు నోచుకోలేదు. ఇది బిజూ పట్నాయక్‌ను అవమానించటమేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలిటీ కౌన్సిల్‌లో మెజారిటీ బీజేడీకి ఉన్నా విగ్రహాన్ని పట్టణంలో ఆవిష్కరించలేదు. విగ్రహం మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలోనే ఉంది.

జమ్మూకాశ్మీర్‌లో సిక్కోలు జవాన్ మృతి

- ఏకే–47తో కాల్చుకుని చనిపోయినట్లు అనుమానాలు
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నేడు



వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నాయక్ బచ్చల తిరుపతిరావు(26) జమ్మూకాశ్మీర్‌లో మృతి చెందాడు. ఏకే–47 గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. అమలపాడుకు చెందిన బచ్చల వెంకటరావు, కామేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గోవింద గ్రామంలోనే నివాసం ఉంటుండగా.. చిన్న కుమారుడు తిరుపతిరావు 2017లో ఇండియన్ ఆర్మీలో చేరాడు. తండ్రి వెంకటరావు సైతం బీఎస్ఎఫ్‌లో జవాన్‌గా విధులు నిర్వహించారు. తిరుపతిరావుకు ఇటీవలే గ్రామానికి చెందిన అమ్మాయితో పెళ్లి నిశ్చయమైంది. ముందుగా ఇల్లు నిర్మించాలని భావించి కొంతమేర అప్పులు చేశారు. తర్వాత వివిధ కారణాలతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలో జమ్మూ కాశ్మీర్‌లోని 8 ఆర్ఆర్ మద్రాస్ రెజిమెంట్ తరఫున ఈ నెల 4న ఎల్ఓసీ వద్ద తిరుపతిరావు విధులు నిర్వహిండగా ఒక్కసారిగా గన్ పేలిన శబ్దం వినిపించింది. వెంటనే ఆర్మీ అధికారులు వెళ్లి పరిశీలించగా తిరుపతిరావు ఏకే–47తో కాల్చుకుని చనిపోయినట్లు గుర్తించారు. అయితే మృతికి గల కారణాలు నిర్ధారించలేదు. అప్పులు ఎక్కువైపోవడం, వచ్చిన జీతం మిగలకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కూడా కారణం కావచ్చనని మరికొందరు చెబుతున్నారు. తిరుపతిరావు మృతదేహం గురువారం అమలపాడుకు రానుంది. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

పింఛన్లు నిలిపివేయడంపై ఆరా

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ నరిగిపెంట గ్రామానికి చెందిన పది మందికి పింఛన్లు ఇవ్వకుండా నిలిపివేయడంపై డిప్యూటీ సీఈవో సత్యనారాయణ ఆరా తీశారు. పింఛన్లు ఆపేశారు మహాప్రభో.. అంటూ బుధవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. పింఛన్ల డేటాను తీసుకుంటానని, ఎంపీడీఓతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటానని చెప్పారు.

గోకార్టింగ్ సీజన్–2 ప్రారంభం

టెక్కలి: ఆటో మొబైల్ రంగంలో నూతన సాంకేతిక ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ఆలోచనలు చేయాలని హైదరాబాద్‌కు చెందిన డీప్‌లూప్ టెక్నాలజీ సీఈవో కుసుమంచి సూర్యప్రకాశ్ కోరారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్–2 పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో మొబైల్ రంగంలో నూతన సాంకేతిక ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో పోటీలు నిర్వహిస్తున్న ఆదిత్య కళాశాలకు అలాగే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థులను అభినందించారు. కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. తమ కళాశాలలో జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలు రెండోసారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మొత్తం 16 బృందాలు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గోకార్టింగ్ కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో–కన్వీనర్లు డి.శ్రీరాములు, ఈసీఈ హెచ్‌వోడీ వి.అశోక్‌కుమార్, సీఎస్ఈ హెచ్‌వోడీ వై.రమేష్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్లు రఘువీర్, విద్యార్థి కన్వీనర్లు పి.ఉదయ్ కుమార్, బి.సాయి సాకేత్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో అతిథులు, కళాశాల యాజమాన్యం

బొత్ర సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న సురేష్ దాస్, తదితరులు

జయపురం: సమాజ సేవకుడు, విద్యాదాత, కవి, రచయిత, పాత్రికేయుడు, స్వర్గీయ ప్రభుదాన్ బొత్ర సేవలు మరువలేనివి అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ప్రభుదాన్ బొత్ర స్మృతి సంసద్, ఫోరెన్స్ నైటింగేల్ ఏఎన్ఎం శిక్షణ కేంద్రం జయపురం సంయుక్తంగా బొత్ర నాల్గో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఫోరెన్స్ నైటింగేల్ ఏఎన్ఎం శిక్షణ కేంద్రం సభాగృహంలో డాక్టర్ సుదాంశు శేఖర్ పట్నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త, డాక్టర్ సురేష్ దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని బొత్ర పత్రికా రంగానికి, సాహిత్య రంగానికి అందించిన సేవలు వివరించారు.

తాగునీటి ప్రాజెక్ట్ పనుల పరిశీలన



కలిమెల ప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రి, అధికారులు



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి రవినారాయణ్ నాయక్

మల్కన్‌గిరి: జిల్లాలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, తాగునీటిశాఖ మంత్రి రవి నారాయణ్ నాయక్ బుధవారం పర్యటించారు. వెంకటపాలెంలోని తాగునీటి ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తిచేయ్యాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం కలిమెల సమితిలోని ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్షించారు. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.37 కోట్లు వ్యయం చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ఐదు గ్రామ పంచాయతీల్లోని 5,865 ఇళ్లకు తాగునీరు సరాఫరా అవుతుందన్నారు. తొలిత జిల్లాలో జరుగుతున్న బోడ జాతర సందర్భంగా కలిమెల సమితి మాన్యంకొండ గ్రామంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, బీజేపీ అధ్యక్షుడు అశోక్ పరిదా తదితరులు పాల్గొన్నారు.



బరిలో నారీ..హోరాహోరీ..

వేదిక ఏదైనా తగ్గేదేలే అని నిరూపిస్తున్నారు నేటితరం మహిళామణులు. కుటుంబ బాధ్యతలైనా.. హోరాహోరీగా సాగే క్రీడాపోటీలైనా మాకు మేమే సాటి అంటూ ముందుకు దూసుకుపోతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సహకారంతో శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో కబడ్డీ, వీల్‌చైర్ పోటీలు నిర్వహించారు. మహిళలంతా ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 7న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

❝ ప్రదక్షిణలు చేస్తున్నా..



శ్రీకాకుళం మండలంలోని వాకలవలస గ్రామానికి చెందిన ఈ రైతు పేరు ఎ.రామారావు. ఈయనకు నాలుగు ఎకరాల భూమి ఉంది. రైతు భరోసా కేంద్రం ద్వారా ఈకేవైసీ కూడా చేయించుకున్నారు. పంట చేతికి వచ్చాక ప్రభుత్వం కొనడానికి ముందుకు రాలేదు. అడిగితే టార్గెట్ పూర్తయిపోయిందని అధికారులంటున్నారు. దళారి దగ్గరకు వెళితే సగం ధర తగ్గించి చెబుతున్నాడు. దీంతో వారం పది రోజులుగా మిల్లర్లు, దళారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



ఆమదాలవలస మండలం దూసిపేట పొలాల్లో ఉన్న వరి కుప్పలు

ధాన్యం దళారుల పాలు

- కొనుగోలు లక్ష్యాలను తగ్గించి రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం
- ఒడిశా ధాన్యంతో టార్గెట్ పూర్తి చేశారంటున్న రైతులు
- క్షేత్రస్థాయి పరిస్థితి గమనించని అధికారులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: అన్నదాత ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారుల పాలవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. పంట దిగుబడిని గుర్తించడంలో లోపం, కొనుగోలు లక్ష్యాలు తక్కువగా పెట్టుకోవడం, ఆ లక్ష్యాలు నెరవేర్చేందుకు ఒడిశా ధాన్యం కొనడం వంటి తప్పిదాలు మన రైతుల పుట్టి ముంచాయి. ఎవరూ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో చివరకు మిల్లర్లు, మధ్యవర్తులతోనే బేరం కుదుర్చుకోవాల్సిన దుస్థితి రైతన్నలకు ఎదురవుతోంది.


లక్ష్యం నిర్ణయంలోనే కుట్ర

జిల్లాలో ఈ ఏడాది 3,60,325 ఎకరాల్లో వరి పండించారు. అయితే ఈ ఏడాది పంటలు ఆలస్యంగా వేసినా, దిగుబడి చాలా వరకు అనుకూలంగానే వచ్చింది. సుమారుగా ఈ ఏడాది వరి 8 లక్షల మెట్రిక్ టన్నుల పై బడి దిగుబడి వచ్చింది. అయితే కోనుగోలు లక్ష్యాన్ని కేవలం 4.90 లక్షల మెట్రిక్ టన్నులుగానే నిర్ధారించారు. అంచనాలు కావాలనే తక్కువ వేసి, కొనుగోలు టార్గెట్లు తగ్గించారు. జిల్లాలో వరి పండించే రైతులు సుమారుగా 2.5 లక్షల మంది ఉన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 99 వేల మంది రైతులు మాత్రమే పంటను విక్రయించారు. మిగిలిన వారు ధాన్యం విక్రయించే పరిస్థితి లేదు.

గ్రామాల్లో దళారులు

ధాన్యం కొనుగోలు టార్గెట్లు పూర్తయిపోయాయని అధికారులు చెబుతుండడంతో.. దళారులు ఈ పరిస్థితిని అలుసుగా తీసుకున్నారు. దళారుల్లో అధిక శాతం మంది అధికార పక్షానికి చెందిన వారే. వీరు మిల్లర్లతో మిలాఖత్ కావడం వల్ల ధాన్యం సగం ధర మాత్రమే పలుకుతోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారు లు నేరుగా రైతుల వద్దకు వెళ్లి సగం ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు పీపీసీ కేంద్రాలు టార్గెట్ పూర్తి చేసే నెపంతో ఒడిశా ధాన్యం తీసుకువచ్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సివిల్ సప్లై అధికారులు కూడా సహకరించడంతో టార్గెట్లు సజావుగా పూర్తయిపోయాయని అంటున్నారు.

❝ ధాన్యం అమ్మలేకపోతున్నాం..



రాష్ట్రంలో గత ఐదేళ్లు ఈ పరిస్థితి లేదు. పీపీసీ కేంద్రాలు, రైతు భరోసాకేంద్రాల ద్వారా నేరుగా ధాన్యంను కళ్లం వద్దకు వచ్చి తీసుకెళ్లేవారు. ఈ ఏడాది ఆర్‌బీకేలు, పీపీసీ కేంద్రాలు, సివిల్ సప్లై అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ధాన్యం కొనడం లేదు. టార్గెట్లు అయిపోయాని అంటున్నారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యం అమ్మలేని పరిస్థితి.

– బి.వెంకటరమణ, వాకలవలస, శ్రీకాకుళం మండలం

అపరాలు పండేంత వరకు..

జిల్లాలోని పలు మండలాల్లో ఫిబ్రవరి నెలాఖరు వరకు వరి నూర్పే పరిస్థితి లేదు. వరి చివరి కాలంలో ఆ పొలాల్లో మినుగులు, పెసలు వంటి అపరాలు పంటలు వేస్తారు. అవి పండేంత వరకు అక్కడే వరి కుప్పలు పెడుతున్నారు. అపరాలు పంటలు మార్చిలో చేతికి వస్తాయి. అప్పుడు వరి, అపరాలు రెండింటినీ నూర్పు యంత్రాల సాయంతో నూర్చడానికి చాలా మంది ప్రణాళిక వేసుకున్నారు. ప్రధానంగా నాగావళి, వంశధార తీరంలో ఉన్న మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

దివ్యాంగులపై దయ లేదాయె..!

- టెక్కలి ఆస్పత్రిలో దివ్యాంగుల అవస్థలు
- పింఛన్ల పునఃపరిశీలన పేరిట తిప్పిస్తున్నారని ఆవేదన



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పింఛన్ల పునఃపరిశీలనకు హాజరైన దివ్యాంగులు

టెక్కలి: టెక్కలి జిల్లా ఆసుపత్రిలో దివ్యాంగులు అవస్థలు పడ్డారు. ఆస్పత్రిలో కొద్ది రోజులుగా చేపడుతున్న పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియలో భాగంగా బుధవారం సంతబొమ్మాళి, పాతపట్నం మండలాల నుంచి సుమారు 50 మంది వరకు దివ్యాంగులు చేరుకున్నారు. అయితే పునఃపరిశీలన ప్రక్రియ ఆపివేశామంటూ అక్కడ సిబ్బంది చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. వారం రోజుల క్రితం అనేక ప్రయాసలతో పునఃపరిశీలన కోసం వస్తే 5వ తేదీన రావాలని చెప్పారని.. తీరా మండుటెండలో అవస్థలు పడుతూ వస్తే ఇప్పుడు తాత్కాలికంగా నమోదు ఆపివేశారని చెప్పడం భావ్యం కాదంటూ పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాల నుంచి ఇక్కడకు రావాలంటే ఆటోల్లో అనేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఉందని వాపోయారు. తమకు ఎటువంటి సమాచారం లేకుండా ఇలా అకస్మాత్తుగా నమోదు ఆపివేయడం సరికాదని నిరాశగా వెనుదిరిగారు. కాగా, పింఛన్ల పునఃపరిశీలన తాత్కాలికంగా ఆపేసిన విషయం తెలియక దివ్యాంగులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఆస్పత్రిలో త్వరలోనే పునఃపరిశీలన ప్రారంభించనున్నట్లు సమాచారం.